# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [10]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [10]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** మార్చి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=2001

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [10]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది పదవ భాగం.***

దీని ముందుభాగం

అలా నరకానికి వెళ్తూ ఉండగా ఉండగా మధ్యలో ఒక నల్లని మబ్బు ఒకటి అడ్డంగా వచ్చింది. ఆ మబ్బుకు అజయ్ కళ్ళు మూసుకుపోయాయి. ఏమీ కనిపించలేదు. ఒక్కసారిగా కళ్ళు తెరిచి చూసే సరికి , పైన ఫ్యాను గిర్రున తిరుగుతున్నది. చేతికి సెలైన్ గుచ్చి ఉన్నది. అంతా నిశబ్దం గా ఉన్నది. తల తిప్పి చూశాడు. మంచం పక్కన కుర్చీ మీద సెల్ ఫోనులో ఆటాడుకుంటూ వేణు కనిపించాడు. అయోమయంగా వేణు వైపు చూశాడు. "చావలేదు, బతికే ఉన్నావు ఆనందపడకు" అని అన్నాడు వేణు. "ఏమైంది?" అన్నాడు అజయ్. "పురుగుల మందు పవరు కాస్త తగ్గింది .గదిలో అపస్మారక స్థితిలో పడి ఉంటే తెచ్చి ఇక్కడ పడేశారు" అని చెప్పాడు. తానూ పురుగుల మందు తాగినట్టు ఎవరికి తెలిసి ఉంటుంది? ఎవరు చూసుంటారా అని ఆలోచించటం మొదలు పెట్టాడు.

తానూ పురుగుల మందు తాగినట్టు ఎవరికి తెలిసి ఉంటుంది? ఎవరు చూసుంటారా అని ఆలోచించటం మొదలు పెట్టాడు. అజయ్ మనస్సుని , ఆలోచనలని అంచనా వేస్తున్న వేణు అతని పరిస్థితిని అర్థం చేసుకొని "నీ అనుమానం నాకు అర్థమైంది. నిన్ను ఎవరు, ఎలా చేర్చారనేకదా!" అన్నాడు వేణు. అవును అనట్టు తల ఊపాడు అజయ్. నీ అదృష్టమో, దరిద్రమో, ఆఖరుసారి ఆ పనిమీద వెళ్ళినప్పుడు నీళ్ళ పంపు కట్టేయటం మర్చిపోయావు. ట్యాంకుడు నీళ్ళు కారిపోయాయి. ఓనరు ఎంతసేపు మోటరు వేసినా నీళ్ళు నిండా రాకపోవటంతో అనుమానం వచ్చి అందరినీ అడిగాడు. ఆఖరుకి నీ దగ్గరకు వచ్చారు. బయట తాళం వేసుంది ,లోపల నీళ్ళ చప్పుడు విని తలుపు బద్దలు కొట్టేసరికి, బాగా పిండి ఆరేసిన తుండుగుడ్డ లాగా నువ్వు పడి ఉన్నావట! ఆంబులెన్సులో ఆస్పత్రికి

తీసుకొచ్చారు. మధ్యాహ్నం నేను నీకు ఆఖరిసారి ఫోను చేశా కదా ! అందుకని వాళ్ళు నాకు చేసి విషయం చెప్పారు. మీ ఇంట్లో చెప్తామన్నారు. నేనే వద్దని మేనేజ్ చేశా" అని వేణు వివరించటం తో అజయ్ ఊపిరి పీల్చుకున్నాడు.

"తమాషా ఏంటంటే, నువ్వు పురుగుల మందు తాగావని ఎవ్వరికీ అనుమానం రాలేదు. డాక్టరు గారిని ఎవ్వరికీ చెప్పొద్దని బతిమిలాడానులే. అంతా నువ్వేదో విషాహారం తిన్నావనుకుంటున్నారు. విషం కలుపుకొని తిన్నావని తెలియదు. తెలిస్తే సానుభూతి చూపిస్తున్న ఓనరు నిన్ను చంపటం ఖాయం" అంటుండగానే అజయ్ ఇంటి యజమాని లోపలికి వచ్చాడు. వేణు తను నిలబడి కుర్చీ యజమానికిచ్చాడు. "ఇప్పుడెలా ఉన్నది అబ్బాయి" అని అడిగాడు. బాగుందన్నట్టు చెయ్యి ఎత్తాడు అజయ్. "ఏదో ఫుడ్ పాయిజన్ అయిందని డాక్టరు గారు చెప్పారు. బయట తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఏవేవో నూనెలు వాడుతుంటారు! ఇంతకీ ఏమి తిన్నవేంటి?" అని అడిగాడు. "డెబ్బై రూపాయలకు చికెన్ బిర్యానీ అంటే తిన్నాడట అంకుల్, వాడు కోడిని బదులు కుక్క మాంసం పెట్టుంటాడు" అన్నాడు వేణు కలగజేసుకుని. "ఆ !.... అదే దెబ్బకొట్టి ఉంటుంది. రెస్ట్ తీసుకోబాబు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాడని ఖాయం చేసుకున్న వేణు, " నీకు పెళ్ళే అనుకున్నా, చావటం కూడా రాదురా ! నీ దరిద్రం ఏంటో చెప్పనా ! పురుగుల మందు తాగటానికి ముందు పీకలదాకా తిన్నావటకదా! ఆ తిండే నిన్ను బ్రతికించింది. లేదంటే కథంతా నువ్వు అనుకున్నట్టుగానే జరిగేది. ఈ పాటికీ ఏ సింహంగానో, ఏ పులిగానో, అమెరికా అడవుల్లో కుక్కగానో పుట్టేవాడివి" అని వేణు అనటంతో, అజయ్ ఆశ్చర్యపోయి చూశాడు, ఇదంతా వీడికేలా తెలుసా అని. "కల అంతా కలవరించావు ,మొత్తం విన్నాలే" అని వేణు తాపీగా మళ్ళీ సెల్లులో ఆడుకోవటం మొదలు పెట్టాడు. మూడురోజులు మంచం మీద ఉంచి, ముప్పై వేలు బిల్లు బాదాక, ఇక ఇంటికి వెళ్ళొచ్చని చెప్పారు.

విషపూరిత ఆహారం తినటం వల్ల ముప్పై వేలు కట్టాల్సి వచ్చిందని ఇంట్లో చెప్పాడు. ఇంట్లో వాళ్ళు గొడవ చేయటంతో తప్పక ఇంటికి చేరాడు. ఆ పురుగుల మందు ప్రభావం తగ్గటానికి, మళ్ళీ మామూలు మనిషి కావటానికి పది రోజులు పట్టింది. వెంటనే ఉద్యోగ ప్రయత్నం అని చెప్పి తిరిగి హైదరాబాదు వచ్చేశాడు. “ఏరా? ఇంకా చావలనుందా?” అన్నాడు వేణు. లేదురా మొన్నటి దెబ్బకు ఇంక చచ్చిన చావకూడదు అనిపిస్తున్నది, బుద్ధి వచ్చింది” అన్నాడు. మాట అయితే అన్నాడు కానీ అజయ్ కి ఏ మాత్రం బతకాలని లేదు. ఎలా చావాలా? అని మళ్ళీ ఆలోచించటం మొదలు పెట్టాడు.

ఇలా గింజుకొని, లాక్కొని, పీక్కొని, కాకుండా క్షణాల్లో అంతా అయిపోవాలి అని అనుకుంటుండగా, ఒకరోజు ఉదయాన్నే పేపరులో “బిల్డింగ్ పై నుండి దూకి టెక్కీ ఆత్మా హత్య” అనే వార్త అజయ్ కంటపడింది. దీనికి మాత్రం తిరుగులేదు. పైకి ఎక్కటం కళ్ళు మూసుకొని దూకటం. అదృష్టం బాగుంటే నేలను తగిలేలోపు ప్రాణం పోతుంది అని మనస్సులో ఆనందించాడు. కొంచెం ఆలస్యమైనా పొరపాటు జరగకుండా, ఎవ్వరికీ అనుమానం రాకుండా తన పని పూర్తి చేసుకోవాలని అనుకొన్నాడు. ఎంతెత్తు నుండి దూకితే, చావు ఖాయంగా వస్తుందో ఆలోచించాడు. చేతులు విరిగి బయపడటం లాంటివి జరగకూడదు, చచ్చినా ఈ సారి చావు తప్పకూడదు” అని అనుకొన్నాడు.

ఇలా చావుతో చెలగాటాలు ఆడి ,చివరి మజిలీ కి చేరిన అజయ్ జీవితం ,ఒక అనూహ్య మలుపు తిరిగింది.అది అజయ్ జీవిత గమనాన్నే మార్చేసింది.అజ్ఞానంతో ,అవివేకంతో ప్రాణాలు తీసుకుందామనుకున్న అజయ్ కి ఒక కొత్త వెలుగు,కొండంత బలము వచ్చేలా ప్రేరేపించింది.

మనిషి దేవుడిని రెండు విషయాల్లో నమ్ముతాడు. ఒకటి తను అనుకున్నది జరగనప్పుడు, రెండు తను ఊహించనది జరిగినప్పుడు. అజయ్ ఇప్పుడు రెండో కోవలోకి వస్తాడు. తన ఉద్యోగం పోయి అజయ్ రోడ్డున పడతాడని ఎప్పుడూ ఊహించలేదు. నిషా తనను విడిచి వేరొకరితో వెళ్ళిపోతుందని కూడా ఊహించలేదు. హైటెక్ సిటీలో కొత్తగా కడుతున్న ఇరవై అంతస్తుల భవనాన్ని తన చావుకి

కేంద్రంగా ఎంచుకున్నాడు. ఇంకొక వారం రోజుల్లో తన ఒకప్పటి ప్రియురాలు నిషా పుట్టినరోజు వస్తుంది. ఆ రోజునే తానూ ఈ లోకం నుండి శాశ్వతంగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

రాత్రిళ్ళు ఆ భవనానికి కాపలా పెద్దగా ఉండదు. ఆ కాపలాదారుల కళ్ళు కప్పి పైకి ఎక్కి దూకి చావాలని ప్రణాళిక వేసుకుని, ఒకటి రెండు సార్లు ఆ భవనాన్ని క్షుణంగా పరిశీలించి వచ్చాడు. చావటానికి ఇంకో నాలుగు రోజులుందనగా ఒకరోజు తన గదిలో భోజనం చేస్తూ, టి.విలో చానళ్లను అటు, ఇటు మారుస్తూ కూర్చున్నాడు. ఒక వార్తా చానల్లో, ప్రేమజంట  ఆత్మహత్య అనే వార్తను చూసాడు. "ప్రేమంటే వాళ్ళది ! ఒకరికోసం ఒకరు ఆత్మహత్య చేసుకోవటం ప్రేమ, అమెరికా వెళ్ళటం మోసం. నేను మోసపోయాను" అని విలపించాడు. ఆ వార్త చూడలేక, ప్రక్క ఛానల్ మార్చాడు " పింజారీ అత్త కూతురు" అనే సీరియల్ వస్తున్నది. ఆ పేరు చూసి అజయ్ ఆశ్చర్యపోయాడు. ఇదే సీరియల్ తను ఇంజనీరింగ్ లో ఉండంగా చూసినట్టు బాగా గుర్తున్నది.  ఇప్పటికీ ఆ సీరియల్ నిరవధికంగా ప్రసారం అవుతుండటం, అతని ఆశ్చర్యానికి కారణం. అసలు ఏముందా ఈ సీరియల్ లో అని చూశాడు.

ఒక అమ్మాయి, చక్కని ఖరీదైన చీరతో, నగలతో ఒక ఇంటి తలుపు తడుతున్నది. ఆ వాతావరణం చూస్తేనే అర్థం అయ్యింది, అది హిందీ నుండి అనువదింపబడిన సీరియల్ అని. మన వాళ్లకి మొదలే 'పొరిగింటి పుల్ల కూర రుచి కదా' వాడెవడో తీసిన సీరియల్ ని, ఇక్కడ ఎగబడి చూస్తున్నారు. ఆ అమ్మాయి తలుపు కొట్టింది. ఇంట్లోంచి ఎవ్వరూ రాలేదు. అరవీర భయంకరమైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మొదలైంది. భయంతో ఆ అమ్మాయి మళ్ళీ తలుపు తట్టింది. ఆ శబ్దం ఇంట్లో ఉన్న ఒక ఆడ మనిషికి వినపడింది. ఆ ఆడ మనిషి తలుపు తీయటానికి రావటం, ఆ బయట నిలబడిన అమ్మాయి తలుపు బాదటం, అలా ఒకరి తరువాత ఒకరిని చూపించి, చివరికి తలుపు తెరుచుకేసరికి అరగంట పట్టింది, తెరుచుకోగానే ఆ రోజుకి శుభం కార్డు పడింది. ప్రత్యేకించి చావకర్లేదు, ఈ సీరియల్ ఆపకుండా ఒకరోజు  చూస్తే, కచ్చితంగా చావచ్చు అనుకున్నాడు అజయ్.ఆ ప్రక్క ఛానల్ కు

మార్చాడు. దానిలో ఒక రాజకీయ చర్చ జరుగుతున్నది. ఒకడు చెప్పేది, ఇంకొకడు వినటం లేదు. ఒక వేళ ఎవడైనా చెప్తూ, అందరూ వింటూ ఉంటే, అతనిని మధ్యలో ఆపి ఇంకొకళ్ళకు అవకాశం ఇస్తున్నారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావటం లేదు. కానీ గందరగోళంగా అరుచుకుంటున్నారు. అదీ నచ్చక అజయ్ ఛానల్ మార్చాడు. తన జీవితాన్ని మార్చుకున్నాడు.

"తతో మలిన సంవీతాం రాక్షసీభిః సమావృతామ్

ఉపవాసకృశాం దీనాం నిఃశ్వసంతీం పునఃపునః "

మట్టి పట్టునటువంటి పట్టు పుట్టం కట్టుకొని ,భారంగా నిట్టూర్పులు విడుస్తూ ,రక్షస స్త్రీల మధ్యన ,ఉపవాసాలతో శరీరం కృసించినదై ,మళ్ళీ మళ్ళీ ఏడుస్తున్నది.

" దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్ "

శుక్ల పక్షం మొటిద రోజులోన కనిపించే నెలవంకలా సీతమ్మ ఉన్నది.

అని రామాయణ ప్రవచనాన్ని చేస్తుండగా అజయ్ విన్నాడు. చచ్చేముందు రామాయణం అయినా వింటే, నరకంలో నాలుగు రోజులు తక్కువ ఉండచ్చు. గాడిద కాకుండా గుర్రంగా అయినా పుట్టచ్చు అనుకొని, రామాయణం వినటానికి సిద్ధపడ్డాడు.

"సకల లాంఛనాలతో ,అయోధ్య రాజ్యానికి మహారాణి అవ్వాల్సిన సీతామ్మ ,అడవులకు రావాల్సి వచ్చింది. అనూహ్యంగా అడవులనుంచి లంకకు తీసుకురాబడ్డది. తన భర్తకు కూడా దూరమయి లంకలో భయంకరమైన రాక్షసుల మధ్య ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ కష్టం ముందు మన కష్టాలెంత? అంతటి దుఃఖంలో ఉన్న సీతమ్మ తల్లిని హనుమ చూసెను", అన్న ఘట్టం దగ్గర ఇవాల్టి ప్రవచనాన్ని ఆపేద్దాం.దీనినే శిద్ధి సర్గ అంటారు. ఇది రామాయణంలోకెల్లా మహత్తరమైన సర్గ. రేపు ఆ తర్వాతనుండి ప్రవచనాన్ని కొనసాగిస్తాను, స్వస్తి" అని చెప్పటంతో అజయ్ టి.వి ఆపేశాడు. అలానే కూర్చొని ఆలోచించటం మొదలు పెట్టాడు. " అస్సలు నిజంగా సీతమ్మ లంకలో అంత మంది రాక్షసుల మధ్య భయం భయంగా ఎలా కూర్చుందా? అతనెవరో కానీ,

రామాయణం చెప్పలేదు, చూపించారు" అని మనస్సులో అనుకుంటుండగా పంతులుగారు గుర్తుకు వచ్చారు. ఊర్లో ఉన్నప్పుడు ఒకసారి ఎవరిగురించో గొప్పగా చెప్పాడు. బహుశా ఈయనేనేమో అనుకుంటూ ,ఫోను తీసి పంతులుగారికి ఫోను చేశాడు.

"ఏమి అజయ్, ఈ సమయాన గుర్తొచ్చాను, ఎలా ఉన్నావు?" అన్నాడు పంతులుగారు. "బాగానే ఉన్నాను, మీరెలా ఉన్నారు ?" అని అడిగాడు. "బాగున్నాము, నీ ఉద్యోగ ప్రయత్నం ఎక్కడిదాకా వచ్చింది. దేనిలోనైనా చేరుతున్నావా? అని అడిగాడు. "ప్రయత్నిస్తున్నాను పంతులుగారు" అన్నాడు. కించిత్ ఇబ్బంది పడుతూ. "ఏంటింకా విశేషాలు?" అన్నాడు పంతులు గారు. "అస్సలు ,సీతమ్మ అంతమంది రాక్షసుల మధ్య ఒంటరిగా ఎంత భాద పడిందో కదా !" అన్నాడు. పంతులుగారు ఆశ్చర్యపోతూ, "నిజమేనయ్యా ! అయినా నువ్వేంటి ఉన్నట్టుండి రామాయణం మీద పడ్డావు? సినిమా, సీరియల్ ఏమైనా చూశావా ఏంటి ?" అని అడిగాడు. "ఇందాక చానల్స్ మారుస్తుంటే, ఎవరో రామాయణం చెప్తుంటే విన్నాను. చాలా బాగా చెప్పారు. మీరప్పుడు ఎవరి పేరో చెప్పారు కదా ? ఎవరు ?" అని అడిగాడు అజయ్. "ఓహో కోటేశ్వరరావు గారి రామాయణం విన్నావా? బాగుంది . ఏమి విన్నావు ?" అని అడిగారు. అదే లంకలో ఉన్న సీతమ్మను ఆంజనేయస్వామి వారు చూశారు అని పూర్తి చేశారు" అని అన్నాడు అజయ్. "ఓహో సుందరాకాండ విన్నావా ? అందులోనూ శిద్ధి సర్గ విన్నవంటే నీకింక మంచి రోజులు మొదలవుతాయి ధైర్యంగా ఉండు, త్వరలోనే ఉద్యోగం వస్తుంది! అస్సలు ఇవాళ్టి రోజున దేశానికి రాజ్యాంగం అవసరం ఎంత ఉన్నదో రామాయణ అవసరం అంత ఉన్నది" అన్నాడు పంతులు గారు. నిజమే అన్నాడు అజయ్ . అలా కాసేపు మాట్లాడి ఫోను పెట్టేశాడు.

"పంతులుగారు చెప్పినట్టు రామాయణం వింటే మంచి జరుగుతుందా? మంచి జరక్క పోయినా చెడు జరగదు కదా, ఒకసారి వినాలి" అనుకున్నాడు. అజయ్ కి రామాయణం వినాలన్న కుతూహలం పెరిగిపోయింది. తన లాప్ టాప్ ని తెరిచి అంతర్జాలం లో కోటేశ్వరరావు గారి రామాయణం కోసం వెతికాడు. శ్రమ పడకుండానే రామాయణం దొరకటంతో ,వినటం

ప్రారంభించాడు. రామాయణం లో లీనమైపోయాడు. ప్రతి కాండంలో ప్రతి సర్గలో తనని తాను ప్రశ్నించుకున్నాడు. తెల్లవారితే పట్టాభిషేకం చేసుకొని రాజు అవ్వాల్సిన వాడు, తండ్రి మాటని కాదనకూడదని అన్నీ వదిలేసి అడవులకు వెళ్ళటమా? అస్సలు అలా ఎవరైనా వెళ్తారా? అడవులకు వెళ్లి రాజ్యాన్ని కోల్పోయాడు. అడవిలో రాజ్యలక్ష్మిని కోల్పోయాడు. ఆలోచిస్తే తను కూడా అదే పరిస్థితుల్లో ఉన్నాడని అనుకున్నాడు. రాజ్యం తో సమానమైన ఉద్యోగం పోయింది . రాజ్యలక్ష్మి తో సమానమైన అమ్మాయి, ఇంకొకళ్ళని చేసుకొని వెళ్ళిపోయింది. కానీ రాములవారు మనిషిగా పుట్టి, మనిషిగా బ్రతికి, మనం ఎలా బతకాలో చూపించాడు. సమస్య ఎదురైనప్పుడు ,ఎదురించి పోరాడి గెలవటం రాముడి లక్షణం ,రామాయణం సారాంశం. అలాంటి రామాయణానికి వారసులమైన మనం ప్రమాదం ఎదురైనప్పుడు ఎదిరించి నిలబడాలి కదా! మరి నేనేంటి, భయపడి, భాదపడి చావలనుకున్నాను. నన్ను కాదని పోయినమ్మాయి తిరిగి రాదు. నన్ను కాదని తానూ సుఖం గా ఉన్నది, మరి నేను చచ్చి ఎవరిని సుఖ పెట్టాలి?" అని తనను తానూ ప్రశ్నించుకున్నాడు. "రాముడినైనా, కృష్ణుడినైనా కీర్తిస్తూ కూర్చుంటామా? వాళ్ళేమి సాదించారో కొంచం గుర్తిద్దాం మిత్రమా" అని సినీ కవి సీతారామ శాస్త్రి గారు శ్రీరాముడి గురించి చెప్పింది బహుశా ఇందుకేనేమో. మొత్తానికి చావాలనే నిర్ణయాన్ని విరమించుకున్నాడు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com